Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

సోమవారం 31/08/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## రూ.వేల కోట్ల విలువైన ధాన్యం, సీఎంఆర్ బకాయిలపై సర్కార్ నజర్


(2లో)

## నీట్‌గా ముగిసిన ఎగ్జామ్



### ⏭ మద్యం తాగి పరీక్షకు వచ్చిన స్టూడెంట్

**టి మీడియా , ఆగస్టు 30 , రంగారెడ్డి :**
నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 2,73,183 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 1,300 కేంద్రాల్లో ఎగ్జామ్? నిర్వహించారు. ఇక తెలంగాణలో 17,627 మంది దరఖాస్తు చేసుకోగా, రాష్ట్రవ్యాప్తంగానూ 56 కేంద్రాల్లో నీట్ ప్రశాంతంగా ముగిసింది.
రంగారెడ్డి జిల్లా శేరిగూడలో ఓ విద్యార్థి మద్యం తాగి పరీక్ష రాసేందుకు వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న అతడిని సిబ్బంది గుర్తించి వెనక్కి పంపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరకుండా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.
మంథని జేఎన్టీయూలో నీట్ పీజీ పరీక్ష పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని మంథని జేఎన్టీయూ కళాశాలలో నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మంథని జేఎన్టీయూ కళాశాలలో 100 మంది విద్యార్థులకు గాను 98 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. అభ్యర్థులను ఉదయం 7:30 నుంచి 8:45 వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. విద్యార్థుల ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు, ఎంబీబీఎస్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్, అడ్మిట్ కార్డును క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు.

# నేపాల్ ఆకస్మిక వరదలు

### ⏭ 788కి పెరిగిన మృతుల సంఖ్య
### ⏭ రంగంలోకి దిగిన భారత రెస్క్యూ బృందాలు

**టి మీడియా , ఆగస్టు 30 , ఢిల్లీ బ్యూరో :**
పాల్-చైనా సరిహద్దుల్లో సంభవించిన జలప్రళయంలో నేపాల్‌లో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నేపాల్‌లో మృతుల సంఖ్య 788కు చేరిందని నేపాల్ పోలీసులు ఆదివారం తెలిపారు. తాజా గణాంకాల ప్రకారం, చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 264 మంది మరణించారు. ఆ తర్వాత నవల్పరాసి ఈస్ట్?లో 194, నవల్పరాసి వెస్ట్?లో 120, గూర్ఖాలో 58, నువాకోట్?లో 52, ధాడింగ్?లో 50, తునహున్?లో 37, రుసువాలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు.
కాగా, నేపాల్ వరదల్లో ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు అయ్యారని నేపాల్ పౌరులు ఉన్నారని న్డర్రుపేర్కొంది. గుర్తుతెలియని మృతదేహాలను గుర్తించే ప్రక్రియ కోసం, వాటిని దేశవ్యాప్తంగా 21 ఆసుపత్రులలో భద్రపరిచినట్లు పేర్కొంది. గల్లంతైన వారిలో 933 మంది హైడ్రోపవర్ (జలవిద్యుత్) ప్రాజెక్టు కార్మికులు కాగా, 592 మంది విదేశీయులు, 127 మంది విదేశీ గ్రూపులతో కలిసి ప్రయాణిస్తున్న ప్రయాణిస్తున్న నేపాల్ పౌరులు ఉన్నారని న్డర్రువెల్లడించింది. అలాగే నేపాల్ పోలీస్, నేపాల్ ఆర్మీ, ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్, కస్టమ్స్ ఆఫీస్, ఇమ్మిగ్రేషన్ ఆఫీస్‌కు చెందిన సిబ్బంది కూడా గల్లంతైన వారి జాబితాలో ఉన్నారని పేర్కొంది. ప్రస్తుతం 239 మంది క్షతగాత్రులు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని లేదా డిశ్చార్జ్ అయ్యారని పేర్కొంది. వీరికి సేవలు అందించడానికి విపత్తు ప్రాంతంలో 6 ప్రత్యేక



శస్త్రచికిత్స వైద్య బృందాలను మోహరించినట్లు తెలిపింది.

**సహాయక చర్యలు ముమ్మరం**

మరోవైపు 20వేల మంది భద్రతా సిబ్బంది భూమార్గం ద్వారా ఇప్పటివరకు మొత్తం 8,730 మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. వైమానిక సిబ్బంది 363 హెలికాప్టర్ ట్రిప్పుల ద్వారా 236 మంది విదేశీయులతో సహా 3,081 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. వరదల్లో చిక్కుకున్న ఒక హైడ్రోపవర్ టన్నెల్ నుంచి 279 మందిని రక్షించారు. మరోవైపు శిథిలాల కింద ఉన్నవారిని రక్షించేందుకు భారత్, చైనా స్పెషల్ రెస్క్యూ బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. కాగా, గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైన మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు, సామూహిక అంత్యక్రియలతో నేపాల్‌లో హృదయవిదారక పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత ప్రాంతాల కోసం నేపాల్ ప్రభుత్వం అత్యవసర నగదు సహాయాన్ని విడుదల చేసింది. ఇందులో భాగంగా రసువా, నువాకోట్ జిల్లాలకు చెరో 10 మిలియన్ల నేపాలీ రూపాయలు, ధాడింగ్‌కు రూ.5 మిలియన్లు, 15 స్థానిక ప్రభుత్వాలకు కలిపి రూ.67.5 మిలియన్ల చొప్పున కేటాయించింది.
ఆగస్టు 26న నేపాల్-చైనా సరిహద్దుల్లో విరుచుకుపడిన ఆకస్మిక వరద పెను విషాదాన్ని మిగిల్చింది. మరోవైపు టిబెట్‌లోని క్యిరాంగ్ కౌంటీలో 16 మంది మరణించగా 546మంది జాడ గల్లంతైంది. లాంగ్‌టాంగ్ నేషనల్ పార్క్‌లోని హిమానీనదం విరిగి లోయలో పడడం వల్ల 5.2 తీవ్రతతో సంభవించే భూకంపానికి సమానమైన శక్తి ఉత్పన్నమైందని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. ఇదే ఆకస్మిక వరదలకు (మిగతా 2లో)

# మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

### ⏭ అసెంబ్లీ మొదలయ్యేలోపు మార్పులు చేర్పులు!

**టి మీడియా , ఆగస్టు 30 , హైదరాబాద్ బ్యూరో :**
రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైందా? అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యేలోపే మంత్రి మండలి విస్తరణ, ప్రక్షాళనకు సీఎం సిద్ధమవుతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గడిచిన నాలుగైదు రోజులుగా రేవంత్ రెడ్డి తన జట్టులో మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలు, సామాజిక సమీకరణాలను ఇందుకు ప్రాతిపదికగా తీసుకుంటున్నట్లు సమాచారం. రాష్ట్ర కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. వారం, పది రోజుల్లో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో విస్తృత చర్చ నడుస్తోంది. మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకునే విషయంలో కొనసాగుతున్న జాప్యం, సీడబ్ల్యూసీ సమావేశం సమయంలో సీఎం రేవంత్ రెడ్డి రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా భేటీ కావడం ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. నాలుగైదు రోజులుగా సీఎం కసరత్తు చేస్తుండడం లాంటి తాజా రాజకీయ పరిణామాలను చూస్తే మంత్రివర్గ విస్తరణతో పాటు ప్రక్షాళన ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.
ప్రస్తుత మంత్రుల శాఖల్లోనూ పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. దాదాపు మంత్రుల అందరి శాఖలను మార్చే పనిలో సీఎం ఉన్నట్లు పీసీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే 80 శాతానికి పైగా పూర్తయిన పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించేందుకు కొందరు మంత్రులు అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్టు తెలుస్తోంది.

**అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ**

ప్రస్తుత కేబినెట్‌లో ఒకరిద్దరు మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమెపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందా అనే ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం మంత్రివర్గంలో రెండు బెర్తులు ఖాళీగా ఉండగా, ఒకరిద్దరు మంత్రులను తప్పిస్తే మరో రెండు స్థానాలు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. దీంతో మొత్తం మూడు నుంచి నాలుగు బెర్తులు అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లా, సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇస్తూ కొత్త వారికి అవకాశం కల్పించే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు తెలుస్తోంది.

**ఈ జిల్లాల వారికి ఈసారి అవకాశం**

ప్రస్తుతం మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు ఈసారి అవకాశం కల్పించే విషయం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. స్పీకర్ గడ్డం ప్రసాద్ మంత్రి పదవిపై ఆసక్తి చూపుతుండడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోటాలో కేబినెట్‌లోకి తీసుకుని, స్పీకర్ పదవిని మరో నేతకు అప్పగిస్తే ఎలా ఉంటుందనే అంశంపై కూడా సీఎం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



అయితే ఏఐసీసీ స్థాయిలో రాజగోపాల్ రెడ్డి పేరు ప్రతిపాదనకు వస్తే సమీకరణాలు మారే అవకాశం ఉందంటున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్? కుమార్ గౌడ్ నేతృత్వంలో ఎన్నికలకు వెళతామని సీఎం పదే పదే చెబుతున్నారు. దీంతో ఆయనకు మంత్రి మండలిలో స్థానం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ పేరును పరిశీలించే అవకాశం కూడా ఉందని ప్రచారం జరుగుతోంది.

**గవర్నర్ కోటాలో 3 స్థానాలు ఖాళీ**

ఈ ఏడాది నవంబర్ గవర్నర్ కోటాలో 3 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఈరవత్రి అనిల్‌ను ముందుగానే కేబినెట్‌లోకి తీసుకుని, ఆ తర్వాత గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించే అంశాన్ని కూడా సీఎం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే ప్రస్తుత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు పార్టీ నేతల్లో చర్చ నడుస్తోంది. స్పీకర్ ప్రసాద్ కుమార్?ను మంత్రి మండలిలోకి తీసుకునేట్లు అయితే స్పీకర్ కుర్చీ ఖాళీ కానుంది. ఆ స్థానాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్‌కు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. అంటే కేబినెట్ విస్తరణతో పాటు స్పీకర్ మార్పు, మంత్రుల శాఖల మార్పు, ఒకరిద్దరు మంత్రుల తొలగింపు, కొత్త వారికి అవకాశం ఇలా భారీ స్థాయిలో మార్పులు చేర్పులకు సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## ఒకప్పుడు ఫుల్ సందడి-ఇప్పుడు భయంభయం



### ⏭ యూపీ, నేపాల్ బోర్డర్‌లోని బ్రిడ్జ్ పరిస్థితి ఇలా!

**టి మీడియా , ఆగస్టు 30 , ఢిల్లీ బ్యూరో :**
నేపాల్‌లో సంభవించిన ఒక ప్రకృతి వైపరీత్యం సరిహద్దు ప్రాంతాలను వణికించింది. దాదాపు మూడు కిలోమీటర్ల పొడవుండి, ఒకప్పుడు ఇరు దేశాల పర్యాటకులతో సందడిగా ఉండే సుస్తా సస్పెన్షన్ బ్రిడ్జ్ ఇప్పుడు భయానక వాతావరణంలో ఉంది. నీటిమట్టాలు తగ్గుతున్నప్పటికీ, నారాయణి నది దృశ్యం ఎంత భయానకంగా ఉందంటే, ప్రజలు దాని ఒడ్డుకు సమీపించడానికి కూడా భయపడుతున్నారు. సుస్తా, చుట్టుపక్కల సరిహద్దు గ్రామాలలో ప్రస్తుత పరిస్థితి ఏమిటి? అని ఈ కథనంలో చదవండి.

**సుస్తా వంతెనపై భయానక దృశ్యాలు**

నేపాల్‌లో సంభవించిన తీవ్ర వరదలు, ప్రకృతి వైపరీత్యాల తర్వాత, సమీపంలోని నవల్పరాసి జిల్లాలో పరిస్థితి విషమంగా మారింది. నారాయణి- గండక్ నదిలో కొట్టుకొస్తున్న శిథిలాలు, మృతదేహాలు స్థానిక ప్రజల గుండెల్లో భయాన్ని నింపాయి. మహారాజ్‌గంజ్‌లోని పాతలహ్వా, మిశ్రౌలియా, బైత్వాలియా, డోమా వంటి సరిహద్దు గ్రామాల నివాసితులు భయంతో జీవించవలసి వస్తోంది. అయితే, యంత్రాంగం మాత్రం పూర్తి అప్రమత్తంగా ఉంది. సహాయక సంస్థలను రంగంలోకి దించారు. నేపాల్ సైన్యం, సాయుధ పోలీసు దళం (ఏపీఎఫ్), స్థానిక అధికారులు నదీమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సుస్తా కట్ట, వంతెన భద్రత విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉన్నారు.

**జీవనోపాధిపై తీవ్ర ప్రభావం**

వరదల కారణంగా సుస్తా ప్రాంతంలో పర్యాటకుల రాక పూర్తిగా తగ్గిపోయింది. దీంతో వంతెన పరిసరాల్లో చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహించే వారిపై తీవ్ర ప్రభావం పడింది. టీ, స్నాక్స్, ఆహార పదార్థాలు విక్రయించే వ్యాపారులు ఆదాయం కోల్పోయారు. సాధారణ రోజుల్లో పర్యాటకులు, స్థానికులతో రద్దీగా ఉండే ప్రాంతం ప్రస్తుతం వెలవెలబోతోంది. సుస్తా సస్పెన్షన్ వంతెన స్థానికులకు కేవలం రాకపోకల మార్గం మాత్రమే కాదు. వారి రోజువారీ జీవనానికి, పిల్లల విద్యకు, వైద్య సేవలు పొందేందుకు ఇది కీలకమైన మార్గంగా ఉంది. వంతెన నిర్మాణానికి ముందు సుస్తా ప్రజలు నేపాల్ ప్రధాన భూభాగానికి వెళ్లాలంటే భారత భూభాగం మీదుగా ప్రయాణించాల్సి వచ్చేది. లేదంటే ప్రమాదకరమైన పడవ ప్రయాణాన్ని ఆశ్రయించాల్సి వచ్చేది.

**భద్రతా కారణాలతో రాకపోకలు నిలిపివేత**

నారాయణి నది ఉధృతి దృష్ట్యా సుస్తా వంతెనపై రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. సుమారు 1,571 మీటర్ల పొడవున్న ఈ వంతెన సుస్తా ప్రాంతానికి కీలక అనుసంధానంగా ఉంది. వరదల ముప్పును ముందుగానే గుర్తించిన అధికారులు పలువురు గ్రామస్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నీటిమట్టం తగ్గడంతో కొందరు తిరిగి ఇళ్లకు చేరుకున్నప్పటికీ, మళ్లీ భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందనే భయం వారిని వెంటాడుతోంది. నేపాల్ సైన్యం, సాయుధ పోలీసు దళం (ఏపీఎఫ్), (మిగతా 2లో)

# రూ.వేల కోట్ల విలువైన ధాన్యం, సీఎంఆర్ బకాయిలపై సర్కార్ నజర్



**⏭|5 వారాల నుంచి విస్తృతంగా విజిలెన్స్ అధికారుల సోదాలు**

**⏭|ఎగవేతకు పాల్పడిన మిల్లర్లపై కేసులు నమోదు**

**టి మీడియా , ఆగస్టు 30 , హైదరాబాద్ బ్యూరో :**
రాష్ట్రంలో రైస్ మిల్లర్ల నుంచి రూ.వేల కోట్ల విలువైన ధాన్యం, సీఎంఆర్ బకాయిల వసూళ్ల వ్యవహారం కీలక మలుపులు తిరుగుతోంది. 5 వారాల నుంచి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సోదాలు నిర్వహిస్తూ దర్యాప్తు ముమ్మరం చేస్తోంది. పౌర సరఫరాల శాఖ ఫిర్యాదులతో ఎగవేతకు పాల్పడిన మిల్లర్లపై పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారు. తాజాగా కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ రంగంలోకి దిగింది. నిజామాబాద్ జిల్లాలో మిల్లులకు సంబంధించి విచారణ ప్రారంభించగా, తాజాగా వనపర్తి జిల్లాకు చెందిన 3 రైస్‌మిల్లుల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

రూ.12 కోట్లు చెల్లించాలని ఫిర్యాదు

పెద్దపల్లి జిల్లా మంథనిలోని పవనసుత రైస్ మిల్లుకు పౌర సరఫరాల శాఖ అధికారులు 5,798 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించారు. కేటాయించిన ధాన్యాన్ని మరాడించి, బియ్యంగా ఇవ్వలేదని పౌర సరఫరాల శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు 2 రోజుల కిందట పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఈ మిల్లుకు 5,789 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగిస్తే, 3,900 మెట్రిక్ టన్నుల బియ్యం రావాలి. కానీ 1,069 మెట్రిక్ టన్నుల బియ్యమే వచ్చింది. బకాయి, జరిమానా కలిపి రూ.12 కోట్లు చెల్లించాలని పౌర సరఫరాల శాఖ అధికారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 10 లారీల ధాన్యం నిల్వ ఉంచే సామర్థ్యం లేని ఈ చిన్న మిల్లుకు అధికారులు వందల లారీల ధాన్యాన్ని ఏ ప్రాతిపదికన కేటాయించారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. అధికారుల మిలాఖత్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మంథని మండలంలోని ఓ రైస్ మిల్లు యజమాని రూ.10 కోట్ల సీఎంఆర్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రభుత్వం ఆ మిల్లును డిఫాల్టర్?గా ప్రకటించింది. దీంతో ఆయన పవనసుత మిల్లును లీజుకు తీసుకుని ఆ మిల్లు పేరిట ధాన్యం కేటాయింపజేసుకుని ఆ ధాన్యాన్ని పాత మిల్లుకు తరలించి బియ్యంగా మార్చారని తెలుస్తోంది. కానీ ఆ బియ్యాన్ని కూడా ప్రభుత్వానికి అప్పగించలేదు. ఈ వ్యవహారంలో బడా రైస్ మిల్లు యజమాని సహా అధికారుల హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని అక్రమాలకు పాల్పడినా డిఫాల్టర్ అయిన మిల్లు యజమానిని పక్కన పెట్టి, సహ భాగస్వామిపై మాత్రమే పోలీసులు ఫిర్యాదు చేయడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.3,983 కోట్లు చెల్లించాలి

ఇలా పౌర సరఫరాల శాఖ చేపట్టిన విజిలెన్స్ తనిఖీల్లో రైస్ మిల్లర్ల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. చాలా మంది మిల్లర్ల దగ్గర ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యం లేదు. సీఎంఆర్?గా ఇవాల్సిన బియ్యం ఇవ్వలేదు. తనిఖీలకు వెళుతున్న అధికారులకు డబ్బులు చెల్లిస్తామని, అది కూడా వెంటనే కాకుండా సమయం కావాలని పలువురు మిల్లర్లు కోరుతున్నారు. 2022–23 రబీ సీజన్‌కు సంబంధించి వేలం ధాన్యం డబ్బులు మిల్లర్లు రూ.3,983 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు వసూలైంది దాదాపు రూ.1,000 కోట్లే. మిగతా రూ.2,983 కోట్లు ఎటు వెళ్లాయో అన్నది కీలకంగా మారింది. డబ్బు పెట్టుబడుల రూపంలోకి మారిందా? ఎవరి పేరుతో పెట్టుబడులున్నాయి? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.కోట్ల అక్రమాలపై ఈడీ దర్యాప్తు

2018 నుంచి అన్ని సీజన్లకు సంబంధించి అత్యధిక బకాయిలు ఉన్న టాప్–20 మిల్లర్ల జాబితాను పౌర సరఫరాలు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు రూపొందించాయి. ఇవే వివరాలు ఈడీకి చేరినట్లు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించినవిగా భావిస్తున్న మిల్లుల్లో జరిగిన రూ.కోట్ల అక్రమాలపై ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. వనపర్తి, సూర్యాపేట జిల్లాల్లో ఎక్కువ బకాయిలు ఉన్న మిల్లర్ల వ్యవహారంపైనా ఈడీ దృష్టి పెట్టి వివరాలు సేకరించినట్లు సమాచారం.

మిల్లర్ల అక్రమ దందాపై రాష్ట్ర ప్రభుత్వ వి జి ల ె న ్ ్

అత్యధిక బకాయిలున్న టాప్–20 మిల్లర్లలో అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో ఆరుగురు ఉన్నారు. నల్గొండలో నలుగురు, వనపర్తి జిల్లాలో ముగ్గురు, ఇతర జిల్లాల్లో మిగతా వాళ్లు ఉన్నారు. ఈ 20 మంది మిల్లర్ల నుంచే రూ.752.12 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. మిల్లర్ల అక్రమ దందాపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించగా, తాజాగా ఈడీ రంగప్రవేశం సంచలనంగా మారుతోంది. మిల్లర్ల అక్రమాల తీవ్రతను పౌర సరఫరాల శాఖ వివరిస్తూ పోలీస్? శాఖ ద్వారా పీడీ యాక్టుతో జైలుకు పంపిస్తోంది. కొందరు మిల్లర్లు రూ.కోట్ల బకాయిలు చెల్లించకుండా జైలుకు వెళ్లడానికి సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి పౌర సరఫరాల శాఖ ఆర్?ఆర్? యాక్టును ప్రయోగిస్తోంది.

ఒక్క మహబూబాబాద్ జిల్లాలోనే ఐదుగురు మిల్లర్లకు ఆర్?ఆర్ యాక్టు కింద నోటీసులు జారీ చేసింది. రెండు మిల్లులు కేసముద్రం, మిగతావి కురవి, ఎల్లంపేట, అప్పరాజుపల్లె కేంద్రంగా వ్యాపారం చేస్తున్నాయి. వీరి నుంచి రూ.55 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయి. అధికారులు, అక్రమార్కులు చేతులు కలిపి ప్రభుత్వాదాయానికి గండి కొట్టినట్లుగా తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ సాగితే అసలు సూత్రధారులు ఎవరో బయటపడే అవకాశం ఉంది.

# ఒకప్పుడు ఫుల్ సందడి-ఇప్పుడు భయంభయం

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక అధికారులు నదీ ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సుస్తా కట్ట, వంతెన భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

734కు చేరిన మృతుల సంఖ్య

మరోవైపు నేపాల్‌లో వరదలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా మృతుల సంఖ్య 734కు చేరింది. మరో 3 వేల మందికి పైగా గల్లంతైనట్లు సమాచారం. దీంతో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భారీగా పేరుకుపోయిన బురద, శిథిలాల కారణంగా సహాయక సిబ్బందికి అనేక ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామాలు, ఇళ్లు బురదలో కూరుకుపోగా, పలు వంతెనలు ధ్వంసమయ్యాయి. నదీ తీర ప్రాంతాల్లో భారీగా శిథిలాలు పేరుకుపోయాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా తాత్కాలికంగా నిలిచిన సహాయక చర్యలు తిరిగి ప్రారంభమయ్యాయి. గల్లంతైన వారి కోసం సైన్యం, భద్రతా బలగాలు, స్థానిక సిబ్బంది కలిసి గాలిస్తున్నారు.

విద్యుత్ మౌలిక సదుపాయాలకు నష్టం

వరదల ప్రభావం నేపాల్ విద్యుత్ రంగంపైనా పడింది. పలు జలవిద్యుత్ ప్రాజెక్టులు, సౌర విద్యుత్ కేంద్రాలు దెబ్బతిన్నాయి. నువాకోట్‌లో త్రిశూలి నది ఒడ్డున ఉన్న సౌర విద్యుత్ కేంద్రం భారీగా దెబ్బతింది. దానిలోని గణనీయమైన భాగం శిథిలాల కింద కూరుకుపోయింది. ఈ ప్రకృతి వైపరీత్యం వల్ల విద్యుత్ మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టం గణనీయంగా ఉందని నేపాల్ ఆర్థిక మంత్రి స్వర్ణిమ్ వాగ్లే తెలిపారు.

నేపాల్‌కు భారత్ అండ

ఈ విపత్కర పరిస్థితుల్లో భారత్ నేపాల్‌కు సహాయం అందిస్తోంది. భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ వెల్లడించిన వివరాల ప్రకారం, దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, టార్పాలిన్లు, ప్లాస్టిక్ షీట్లు, పరిశుభ్రతా కిట్లతో సహా 11 టన్నుల సహాయ సామగ్రిని భారత్ పంపింది. గాలింపు, సహాయక చర్యలకు అవసరమైన పరికరాలతో కూడిన అదనపు సాంకేతిక బృందాన్ని కూడా పంపినట్లు తెలిపారు. అదే సమయంలో వివిధ సామాజిక సంస్థలు కూడా నేపాల్ బాధితులకు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. అయితే పంజాబ్ నుంచి సహాయ సామగ్రితో నేపాల్‌కు వెళ్తున్న ఓ వాహనాన్ని సోనౌలి సరిహద్దు వద్ద అధికారులు అడ్డుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో ఆ వాహనాన్ని నేపాల్‌లోకి అనుమతించలేదు.విపత్తులు కేవలం భౌగోళిక సరిహద్దులను మాత్రమే మార్చవని, అవి వర్ధిల్లుతున్న సమాజాలను క్షణంలో నాశనం చేయగలవని ఈ విపత్తు స్పష్టంగా గుర్తుచేస్తుంది. పరిపాలనా యంత్రాంగం, సహాయక సంస్థల సత్వర కృషి ఫలితంగా, సుస్తా, నారాయణి నదీ తీరంలోని గ్రామాల్లో జనజీవనం త్వరలోనే సాధారణ స్థితికి చేరుకుంటుందని, అలాగే సుందరమైన సుస్తా సస్పెన్షన్ వంతెన పూర్వపు అందాన్ని తిరిగి పొందుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

# జపాన్ పర్యటనకు వెళ్తున్న మిత్రునికి సన్మానం



**టీ మీడియా, ఆగస్టు 30, పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణానికి చెందిన పి మురళి కృష్ణ యాపర్ల ప్రాథమిక పాఠశాలలో ఎస్ జి టి గా విధులు నిర్వహిస్తున్నారు తెలంగాణా ప్రభుత్వం ప్రతిస్టాత్మకంగా చేపట్టిన జపాన్ విద్యా పర్యటనకు ఎంపిక అయ్యారు రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 5 నుండి 12 వరకు జరగనున్న ఈ పర్యటనకు మొత్తం మీద 29 మంది ఉపాధ్యాయులు 11 మంది విద్యా శాఖ అధికారులు వెళ్తున్నారు అయితే వనపర్తి జిల్లా నుండి మురళి కృష్ణ ఒక్కరే ఎంపిక కావడం విశేషమని వారి మిత్ర బృందం తెలిపారు జపాన్ పర్యటనలో క్రమశిక్షణ సాంకేతిక విద్య జీవన నైపుణ్యాలు సైన్స్ రోబోటిక్ భోధనా పద్ధతులను పరిశీలించనున్నారు ఈ సందర్భంగా ఆయన మిత్ర బృందం శాలువా పూల మాలలతో సన్మానించారు ఈ కార్యక్రమంలో వెంకటన్నగౌడ్ బీ సీ పొలిటికల్ జె ఏ సి రాష్ట్ర కార్యదర్శి వల్లపు రెడ్డి శ్రీధర్ రెడ్డి మేకల రమేష్ యాదవ్ వెంకటేశ్ యాదవ్ లక్ష్మయ్య యాదవ్ శ్రీనాథ్ నాయుడు వెంకటేష్ గిరిజా గౌడ్ రామ్ ప్రసాద్ పాల్గొన్నారు

# నేపాల్ ఆకస్మిక వరదలు

(మొదటి పేజీ తరువాయి)

కారణమైందని పేర్కొంది. దాదాపు 100 కిలోమీటర్ల మేర రాళ్లు, బురదతో కూడిన వరద ముంచెత్తిందని పేర్కొంది.

సొరంగంలో చిక్కుకున్న కార్మికులు

ఆకస్మిక వరదల ధాటికి రసువాలోని అప్పర్ త్రిశూలీ హైడ్రోపవర్ ప్రాజెక్ట్ టన్నెల్ బురదతో నిండిపోవడంతో, 100 మందికి పైగా కార్మికులు చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్, సర్వైవర్ డిటెక్షన్, డీఎన్‌ఏ పరీక్షల కోసం నేపాల్ చేసిన విజ్ఞప్తి మేరకు భారత్ ప్రత్యేక నిపుణుల బృందాన్ని పంపించింది. అంతేకాదు ఆహారం, మందులు, దుప్పట్లు, రహదారుల పునరుద్ధరణకు ప్రీ–ఫ్యాబ్రికేటెడ్ బ్రిడ్జిలను అందజేసింది. వాతావరణం కాస్త అనుకూలించడంతో నేపాల్ సైన్యం, భారత రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. చైనా కూడా నిపుణులను రెస్క్యూ ఆపరేషన్‌కు పంపింది. శిథిలాల కింద లభ్యమవుతున్న మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా పాడవడంతో, అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు డీఎన్‌ఏ నమూనాలు సేకరించి, ఆరుబయట సామూహికంగా ఖననం చేస్తున్నారు. కాగా టిబెట్‌లో వరద కారణంగా ఏర్పడిన బారియర్ సరస్సు ముప్పు తగ్గినట్లు చైనా నిపుణులు చెప్పడం పెద్ద ఉపశమనం కలిగించింది. ఆ సరస్సులోని నీటిమట్టం క్రమంగా తగ్గుతోందని స్పష్టమైనప్పటికీ, ఆ నీరు పూర్తిగా దిగువకు చేరేవరకు ప్రమాదం పొంచే ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. దేశాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు దాదాపు 5 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.40 వేల కోట్లు అవసరమవుతాయని నేపాల్ ప్రభుత్వం అంచనా వేసింది.

# బీఎల్‌ఏల ఆత్మీయ సమావేశంలో దుద్దిళ్ల శ్రీను బాబు



**● ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో**

**టి మీడియా ,ఆగస్టు 30 ,మధిర:**
ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండల కేంద్రం జానకీపురం గ్రామంలో నిర్వహించిన మండల కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్‌ఏ) ఆత్మీయ సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ప్రత్యేకంగా పాల్గొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సమావేశానికి హాజరైన శ్రీను బాబు, మండలంలోని బూత్ స్థాయి కార్యకర్తలు, బీఎల్‌ఏలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు.ప్రతి బూత్‌లో పార్టీ కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మధిర నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల స్థాయి కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# నవ జంటలను ఆశీర్వదించిన కందాల



**టి మీడియా ,ఆగస్టు 30 ,కూసుమంచి:**
కూసుమంచి మండలం లో ఆదివారం జరిగిన పలు వివాహ మహోత్సవ వేడుకలకు పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి హాజరై, నవధంపతులకి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నాయకన్ గూడెం గ్రామం కంచర్ల శ్రీనివాస్ రెడ్డి పుష్పలత ల కుమార్తె మన్మిత–గిరి సాయి రెడ్డిల నిశ్చయతాంబుల కార్యక్రమం కి, పాలేరు బీవీ రెడ్డి ఫంక్షన్ హాల్ నందు మూల్కురి అంజిరెడ్డి – రుక్మిణి గార్ల కుమారుడు మనోజ్ రెడ్డి – సరస్వతి, చేగుమ్మ గ్రామంలో గిరిబోయిన సీతారాములు – నాగేంద్ర కుమారుడు రాము – సింధు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా వివాహ వేడుకల్లో నవ దంపతుల దాంపత్య జీవితం సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, ఆనందాలతో నిండి, చిరకాలం అన్యోన్యంగా ఉండాలని కందాల ఉపేందర్ రెడ్డి నవ దంపతులకి అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా నాయకులు మళ్లీదు వెంకటేశ్వరరావు, జర్పుల బాలాజీ నాయక్, కూసుమంచి మండల బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు వేముల వీరయ్య, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆసిఫ్, కూసుమంచి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు గురవాయి గూడెం గ్రామ సర్పంచ్ బానోతు బిక్షం నాయక్, నాయకులు అద్దంకి ఉపేంద్ర చారి, కందాల అభిమాని దాసరి వెంకన్న, నాయకన్ గూడెం మాజీ సర్పంచ్ కాసాని సైదులు, కూసుమంచి మండలం మాజీ ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి ఎద్దడికి తక్షణ పరిష్కారం

**● సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జారే**

**టి మీడియా ,ఆగస్టు 30, దమ్మపేట:**
మండల పరిధిలోని మొద్దులగూడెం ఎస్సీ కాలనీలో గత రెండు రోజులుగా తాగునీటి ఎద్దడితో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ తక్షణమే స్పందించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఎమ్మెల్యే జారే కాలనీకి తక్షణమే కొత్త బోర్వెల్ ను మంజూరు చేయించి, బోర్ వేయించి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు.సమస్య చిన్నదైనా,



పెద్దదైనా ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, వెంటనే పరిష్కరిస్తూ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు మొద్దులగూడెం ఎస్సీ కాలనీ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మంత్రి పొంగులేటి పర్యటనకు ఏర్పాట్లు



**టి మీడియా ,ఆగస్టు 30,కేసముద్రం:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో నిర్వహించే వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు సోమవారం వస్తున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. అధికారులతో సహా కాంగ్రెస్ నేతలు సోమవారం మంత్రి పర్యటన విజయవంతం చేయడానికి అవసరమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కేసముద్రం మండల పరిషత్ ఆవరణలో నిర్వహించే మంత్రి సభకు చురుకుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. సభా వేదిక తో పాటు సభాస్థలి ఏర్పాట్లను శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ తదితరులు హాజరు కానున్నారు.

**అభివృద్ధి కార్యక్రమాల వివరాలు ఇవే**

కేసముద్రం మండల పరిషత్ ఆవరణలో నిర్వహించే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముందుగా కేసముద్రం (వి) లో కోటి 90 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా 4.6 కోట్లతో నిర్మించనున్న కేసముద్రం మున్సిపాలిటీ ఆఫీస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అలాగే కార్యాలయాన్ని నూతనంగా జిల్లాలో ఇటీవల ఏర్పడ్డ ఇనుగుర్తి, సిరోల్, దంతాలపల్లి మండల కేంద్రాల్లో 2.25 కోట్ల చొప్పున ఒక్కో తహసిల్దార్ కార్యాలయాలను నిర్మించనున్నారు. వాటి నిర్మాణానికి కూడా ఇక్కడి నుండే వర్చువల్ గా మంత్రి శంకుస్థాపన చేస్తారు. అనంతరం 8 ఏళ్ల కాలంగా భూమి హక్కులు లేక ఇబ్బందులు పడుతున్న నారాయణపురం గ్రామానికి చెందిన 780 మంది రైతులకు రీ సర్వే చేయించి ప్రభుత్వం నూతనంగా జారీచేసిన పట్టా పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తారు. అనంతరం రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత ఇక్కడ నుండి మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు ఇతర అధికారులతో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై మంత్రి సుదీర్ఘంగా సమీక్షిస్తారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యం

**⏭ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మార్నింగ్ వాక్**



**టి మీడియా ,ఆగస్టు 30 అచ్చంపేట:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా అచ్చంపేట ఎమ్మెల్యేడాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేపడుతున్న మార్నింగ్ వాక్‌లో భాగంగా శనివారం ఐనోల్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో నడుస్తూ ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినతులను స్వీకరించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఐనోల్‌లోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, భోజనం, వసతులు, మౌలిక సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి మండలం, గ్రామంలో మార్నింగ్ వాక్ నిర్వహిస్తూ ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను వారికి వివరించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ దారుణ హత్య

**⏭ నిందితుడి కోసం పోలీసులు గాలింపు**



**టి మీడియా ,ఆగస్టు 30, బాన్సువాడ:** నిజామాబాద్ జిల్లా వర్ని మండలం తగిలేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మైసమ్ వెంకటెశ్వర్లు (50) దారుణ హత్య కు గురయ్యారు. తగిలేపల్లి శివారులోని వ్యవసాయ పొలం వద్ద మైసమ్ వెంక వెంకటెశ్వర్లు తలపై పదునైన ఆయుధంతో దాడి చేశారని తీవ్ర రక్త స్రావం కావడంతో అక్కడే మృతి చెందాడని సిఐ కృష్ణ తెలిపారు. ప్రక్క ప్రక్కన ఉన్న పొలం తగాదాల వల్లే బక్క నారాయణ అతని కుమారులు కలిసి వెంక వెంకటెశ్వర్లు ఐన నా భర్తను హత్య చేశారని భార్య రుకుం బాయి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.గతంలో వెంకటెశ్వర్లు ఎంపిటిసి ఉన్నప్పుడు నిందితుడు బక్క నారాయణ ఉప సర్పంచ్ గ పని చేశారు. అప్పటి నుండి కొన్ని కారణాల వల్ల రాజకీయ కక్షలు పేరుగాయి. రాజకీయ కక్షలు,భూ వివాదం వెంకటెశ్వర్లు ప్రాణం తీసింది. మృతుడు వెంకటెశ్వర్లు ఒకసారి ఎంపిటిసి 2 పర్యాయాలు సర్పంచిగా పని చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నిందితుడినీ త్వరలో పట్టుకుంటామని సిఐ కృష్ణ తెలిపారు.

# క్రీడలకు కొత్త కెప్టెన్లు



**టి మీడియా ,ఆగస్టు 30,ఇల్లెందు:** సింగరేణి ఇల్లందు ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కోఆర్డినేటర్‌గా అజ్మీరా కిషోర్, జనరల్ కెప్టెన్‌గా రాపూరి బాబురావు నియమితులయ్యారు. జీఎం వి. కృష్ణయ్య ఆదేశాల మేరకు శనివారం నియామక కార్యక్రమం నిర్వహించారు. ఇంచార్జ్ ఎస్ఓ టు జీఎం, ఏరియా క్వాలిటీ మేనేజర్ కె. రామదాసు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ వైస్‌ప్రెసిడెంట్ జె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కె. రామదాసు మాట్లాడుతూ.. ఉద్యోగుల మానసిక ఉల్లాసం, ఆరోగ్యం, ఒత్తిడి తగ్గించేందుకు సింగరేణి సంస్థ క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు కంపెనీ అనేక అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఇల్లందు ఏరియా క్రీడాకారులు కంపెనీ, కోల్‌ఇండియా స్థాయిలో రాణించి సింగరేణికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) అజ్మీరా తుకారాం, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జి. సుధాకర్, బౌూ ‌ ‌డ ‌ +ూ హానరరీ సెక్రటరీ అశోక్, క్లర్క్ వీరన్న తదితరులు పాల్గొన్నారు

## సీతారామ ప్రాజెక్టు నీళ్లు సింగరేణి కి అందించాలి



**⏭ అవసరమైతే పెద్ద ఉద్యమం**

**⏭ బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు**

**టీ మీడియా,ఆగస్ట్30,సింగరేణి(కారేపల్లి):** సింగరేణి మండలం బిక్యతండా గ్రామంలో ఆదివారం నిర్వహించిన తీజ్ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు పాల్గొన్నారు.గ్రామస్తులు,గిరిజన సంప్రదాయాల మధ్య జరిగిన తీజ్ వేడుకల్లో పాల్గొని అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం తాండ్ర వినోద్‌రావు,అజ్మీర బిచ్చ నాయక్‌లు విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి మండలానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సీతారామ ప్రాజెక్టు నీళ్లు మండలంలోని రైతులకు అందితే వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.సింగరేణి మండలానికి ప్రాజెక్టు నీళ్లు అందించే విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు.అవసరమైతే భవిష్యత్తులో రైతులు,ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు మాన్‌సింగ్,అప్పాయిగూడెం మాజీ సర్పంచ్ అజ్మీర అరుణ,నాయకులు ఇస్లావత్ సురేష్,గుగులోతు మోహన్‌తో పాటు గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతిని ప్రభుత్వాలు పరిరక్షించాలి





**టీ మీడియా,ఆగస్ట్30,సింగరేణి(కారేపల్లి):** గిరిజన సంస్కృతి,సంప్రదాయాలను ప్రభుత్వాలు పరిరక్షించాలని గిరిజన నాయకుడు బీఆర్ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న కోరారు. ఆదివారం కారేపల్లి మండలం భీక్యాతండ లో తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.తీజ్ చివరి రోజు వేడుకను తండా వాసులు ఐక్యంగా వైభవంగా జరిపారు.ఈ సందర్భంగా అజ్మీర వీరన్న మాట్లాడుతూ గిరిజన సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని దానిని రాబోయే తరాలకు పరిచయం చేసే బాధ్యత ప్రభుత్వాలదన్నారు.తొమ్మిది రోజుల పాటు గ్రామంలో గిరిజన యువతులు తీజ్ సాంప్రదాయాన్ని ఆచరించడం అభినందనీయం కొనియాడారు.

# వివాహా వేడుకలకు హాజరైన మున్సిపల్ చైర్మన్

**టీ మీడియా, ఆగస్టు 30 ,పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటి పదో వార్డుకు చెందిన చింతకాయల భీముని అక్క కొడుకు వివాహం ఆదివారం వారి నివాసంలో జరిగిన మహోత్సవానికి మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు వధూ వరులను ఆశీర్వదించారు అనంతరం చెలిమిల్లకు చెందిన మంగలి శీను కొడుకు వివాహం ఎస్ఎల్వి కళ్యాణ మండపంలో జరిగిన వివాహానికి హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు అనంతరం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన బాలరాజు శెట్టి వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటేష్ సాగర్ సురేందర్ గౌడ్ మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడు రణధీర్ రెడ్డి రాములు యాదవ్ శివ వినయ్ వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు



# పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



### ⏭ శాంతిభద్రతల పరిరక్షణపై దిశానిర్దేశం

**టీ మీడియా ,ఆగస్టు 30, ఆళ్లపల్లి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు సబ్ డివిజన్ పరిధిలోని ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను ఇల్లందు డివిజనల్ పోలీస్ అధికారి (డీఎస్పీ) యు. వెంకన్న బాబు గారు శనివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతలు, పోలీసు సిబ్బంది విధి నిర్వహణ, రికార్డుల నిర్వహణపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారుడీఎస్పీ వెంకన్న బాబు గారు పోలీస్ స్టేషన్‌కు చేరుకోగానే అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని ప్రధాన రికార్డులు, వర్టికల్స్ నిర్వహణ, కేసులు దర్యాప్తు పురోగతి, మరియు వివిధ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్న ఆయన, విధి నిర్వహణలో ప్రదర్శిస్తున్న పనితీరుపై పలు సూచనలు చేశారు.
కేసుల దర్యాప్తుపై ప్రత్యేక ఆదేశాలు
ఈ సందర్భంగా డీఎస్పీ గారు మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నేరాల తీవ్రతను బట్టి సాక్ష్యాధారాలను సేకరించి, నిందితులకు తగిన శిక్ష పడేలా చూడాలన్నారు.పోలీస్ స్టేషన్‌కు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే బాధితులు మరియు ఫిర్యాదుదారులతో సిబ్బంది ఎంతో మర్యాదపూర్వకంగా, ఓపికతో వ్యవహరించాలని డీఎస్పీ ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ స్ఫూర్తితో ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, సత్వర పరిష్కారం చూపాలని సూచించారు.మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని కోరారు. రాత్రి సమయాల్లో గస్తీ (పెట్రోలింగ్) పెంచాలని, అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది క్రమశిక్షణతో, అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు విశ్వసనీయమైన సేవలు అందించాలని దిశానిర్దేశం చేశారు.ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో ఇల్లందు డీఎస్పీ యు. వెంకన్న బాబు గారితో పాటు టేకులపల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ (సీఐ) బి. సత్యనారాయణ గారు, అల్లపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్హెచ్ఓ) ఎం. సోమేశ్వర్ గారు మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 2న అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు



### ⏭ విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు

**టి మీడియా , ఆగస్టు 30 , అనకాపల్లి :**
గోదావరి జలాలు అనకాపల్లి జిల్లా పోలవరం కాలువ ద్వారా తరలింపునకు సర్వం సిద్ధమైంది. సెప్టెంబర్ 2న సీఎం చంద్రబాబు పాయకరావుపేట పర్యటనలో భాగంగా గోదావరి జలాలు పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో జల హారతి కార్యక్రమానికి రానున్న ముఖ్యమంత్రి పర్యటనకు అనకాపల్లి జిల్లా అధికారులు పాయకరావుపేటలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా పాయకరావుపేట మండలంలోని పీఎల్? పురం వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు.
రైతులు, మహిళలు, కార్యకర్తలు కలిపి సుమారు 40 వేల మంది వరకు సభను వీక్షించేందుకు హాజరుకానున్నారు. ఇందుకుగానూ రవాణా శాఖ అధికారులు సుమారు 700 బస్సులను సిద్ధం చేస్తున్నారు. అందుకు అనుగుణంగా భారీ టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్?కు, సభ వద్దకు నేరుగా చేరుకునే విధంగా మార్గాలను ఇంజినీరింగ్? అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను హోం మంత్రి అనిత, జిల్లా ఇన్?చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్?? విజయకృష్ణన్?? పర్యవేక్షిస్తున్నారు.
పోలవరం ఎడమ కాలువ జలహారతి కార్యక్రమానికి సంబంధించి నక్కపల్లి మండలంలో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 14న జలహారతి ఇవ్వాలని తొలుత భావించినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పనుల్లో జాప్యం చోటుచేసుకోవడం సెప్టెంబరుకు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఆరో ప్యాకేజీలో భాగంగా పాయకరావుపేట నుంచి దార్లపూడి వరకు 24 కిలోమీటర్ల పరిధి ఉంది. ఇందులో నక్కపల్లి మండలంలోనే సగానికిపైగా ఉండటం, చాలా మెరక గ్రామాల మీదుగా కాలువ తవ్వకం జరిగింది. పలు గ్రామాల వద్ద ప్రజల రాకపోకల నిమిత్తం వంతెనలు, పంట కాలువలు నిర్మించారు. జలహారతి తేదీ ప్రకటించినప్పటి నుంచి మిగిలిన పనులను అధికార యంత్రాంగం ఉరుకుల పరుగులతో చేయించింది.
రమణయ్యపేట: ఈ గ్రామం మీదుగా రేబాక, రేవళ్ల, తిరుపతిపాలెం గ్రామాలకు జనం రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ ర.భ.శా. పరిధిలో రోడ్డును దాటాల్సి ఉంది. దీంతో ప్రత్యామ్నాయంగా భారీ పైపులతో పెద్ద వంతెన నిర్మించారు. దీన్ని కేవలం 3 వారాల్లోనే పూర్తి చేయడం విశేషం. దీనిపై రాకపోకలు మొదలు పెట్టి, పాత రోడ్డును తవ్వేసి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు.
ముకుందరాజుపేట: ఇక్కడ ఓ వంతెనతోపాటు గెడ్డపై మినీ అక్విడక్టు తరహాలో భారీ మదుము నిర్మిస్తున్నారు. ఇందులో వంతెన నిర్మాణం పూర్తి కాగా రెయిలింగ్, అప్రోచ్ రోడ్డు వేయాల్సి ఉంది. గెడ్డపై కాలువ నిర్మాణం తుది దశకు చేరింది. గెడ్డ నీరు అడుగు భాగం నుంచి వెళ్లేలా, పైనుంచి పోలవరం నీరు వెళ్లనుంది. ముకుందరాజుపేట గ్రామానికి ఇరువైపులా ఇటు జి.జగన్నాథపురం, అటు గుల్లిపాడు మీదుగా రాకపోకలు సాగించడానికి వీలుగా రెండు వంతెనలుండటం విశేషం.
సీతంపాలెం: ఈ గ్రామం నుంచి సీహెచ్‌బీ అగ్రహారం, వెదుళ్లపాలెం మీదుగా జాతీయ రహదారికి చేరుకోడానికి వీలుగా వంతెన అవసరమైంది. దీంతో అధికారులు 2 నెలల కిందట దీని నిర్మాణం మొదలు పెట్టి ప్రస్తుతం పూర్తి చేశారు. రెయిలింగ్, అప్రోచ్ రోడ్డు పని మిగిలి ఉంది. ఇటీవల కాలం వరకు దీనికి పక్కనే ఉన్న మట్టిరోడ్డుపై నుంచి స్థానికులు రాకపోకలు సాగించారు. ఈ క్రమంలో దీనికి ప్రత్యామ్నాయంగా కాంక్రీటు గెడ్డ మార్గంలో రాకపోకలకు ఏర్పాటు చేసి, మట్టి రోడ్డును తొలగించారు.

# వివాహ వేడుకలో తుంభూరు దయాకర్ రెడ్డి

**టీ మీడియా ఆ,గస్టు 30, కూసుమంచి :**
కూసుమంచి మండలం లో వివిధ గ్రామాలలో ఆదివారం జరిగిన వివాహ వేడుకలో రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయం ఇన్చార్జి తుంబురి దయాకర్ రెడ్డి పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించారు. మండలంలోని పెరక సింగారం గ్రామానికి చెందిన పత్తి వెంకటేశ్వర్లు--మంగమ్మ కుమారుడు అరవింద్--భార్గవి, గైగోలపల్లి గ్రామానికి చెందిన ముల్కూరి అంతిరెడ్డి--రుక్మిణి దేవి కుమారుడు మనోజ్ రెడ్డి-- సరస్వతి వివాహ వేడుకలకుశ్రీ ఆయన హాజరైనారు.
ఈ సందర్భంగా వధూవరుల దాంపత్య జీవితం సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, ఆనందాలతో నిండి, చిరకాలం అన్యోన్యంగా ఉండాలని తుంబూరి దయాకర్ రెడ్డి మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో



కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇంచార్జి భీమ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డిసిసి జిల్లా కార్యదర్శి మహ్మద్ హఫీజుద్దీన్, మాజీ ఎం పి పీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జూకూరి గోపాలరావు, బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, బండ్ల మంగిరెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హాఫ్ మారథన్ లో లకారం రన్నర్స్ ప్రతిభ





### ⏭ నిర్దేశిత టైంలో కంప్లీట్ చేసి మెడల్స్

**టీ మీడియా, ఖమ్మం :**
దేశంలోనే ఎంతో పేరుగాంచిన 15వ ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్--2026లో ఖమ్మంకు చెందిన లకారం రన్నర్స్ సభ్యులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. హాఫ్ మారథాన్‌లో పరుగెత్తిన వీరు నిర్దేశిత సమయంలో రేస్‌ను పూర్తి చేసి మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన వారిలో రామారావు, బాబురావు, సునీల్, నరేష్, ఉపేందర్, ఈశ్వర్, రమేష్, భాగం శేషగిరిరావు ఉన్నారు. శేషగిరిరావు కుమార్తె కూడా ఈ పరుగులో ఉత్సాహంగా పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. క్రీడాస్ఫూర్తిని చాటి మెడల్స్ గెలుచుకున్న లకారం రన్నర్లను పలువురు అభినందించారు. ఇదే విధంగా అనేక మారథాన్ లలో పాల్గొని ఖమ్మంకు పేరు తీసుకొని రావాలని, ఎంతో మందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# యారాడలో యువకుడు గల్లంతు

### ⏭ లైఫ్‌గార్డ్ చొరవతో ఆర్కే బీచ్‌లో తప్పిన ముప్పు

**టి మీడియా , ఆగస్టు 30, విశాఖపట్నం :**
సముద్ర తీర ప్రాంతాల్లో పర్యాటకుల నిర్లక్ష్యం ప్రాణాల మీదకు తెస్తోంది. ఈత నిషేధిత ప్రాంతం అని అధికారులు, లైఫ్ గార్డ్స్ ఎంతగా మొత్తుకుంటున్నా కొందరు వినడం లేదు. ఆ హెచ్చరికలను పెడచెవిన పెట్టి సముద్రంలోకి దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. తాజాగా విశాఖపట్నంలోని వేర్వేరు బీచ్‌లలో రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఆర్కే బీచ్‌లో ఓ వ్యక్తి ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకోగా, యారాడ బీచ్‌లో ఓ యువకుడు సముద్రంలో గల్లంతయ్యాడు.
తప్పిన పెను ప్రమాదం
విశాఖ నగరంలోని ఆర్కే బీచ్ పర్యాటకులతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అయితే ఇక్కడ సముద్రపు అలల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. అకస్మాత్తుగా రాకాసి అలలు ఎగసిపడుతుంటాయి. అందుకే ఇక్కడ ఈత కొట్టడాన్ని అధికారులు నిషేధించారు. అయితే, నగరంలోని రెల్లి వీధికి చెందిన చిన్న ఈశ్వరరావు (56) అనే వ్యక్తి ఆర్కే బీచ్‌కు వచ్చాడు. స్నానం కోసం నీట్లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఇది ఈత నిషేధిత ప్రాంతం అని, లోపలికి వెళ్లొద్దని అక్కడే ఉన్న లైఫ్ గార్డ్స్ ఎంతగా వారించినా అతను వినలేదు. ఆ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ నిర్లక్ష్యంగా సముద్రంలోకి దిగాడు.
ప్రాణదాతగా నిలిచిన లైఫ్ గార్డ్
నీట్లోకి దిగిన కొద్దిసేపటికే ఈశ్వరరావు ఉధృత కెరటాల మధ్యలో చిక్కుకుపోయాడు. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలల తాకిడికి తట్టుకోలేక నీటిలో మునిగిపోయాడు. ప్రాణభయంతో కాపాడాలంటూ ఆర్తనాదాలు చేశాడు. ఇది గమనించిన బీచ్ లైఫ్ గార్డ్ ధనరాజు వెంటనే అప్రమత్తమయ్యాడు. ప్రాణాలకు తెగించి



సముద్రంలోకి దూకాడు. వేగంగా ఈదుకుంటూ వెళ్లి ఈశ్వరరావును పట్టుకున్నాడు. అలల ఉధృతికి ఎదురొడ్డి, అతికష్టం మీద అతడిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చాడు. దీంతో అక్కడ ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రాణదాత అయిన లైఫ్ గార్డ్ ధనరాజును అందరూ అభినందించారు.
యారాడ బీచ్‌లో విషాదం
విశాఖ పరిధిలోని గాజువాక ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ పర్యాటక కేంద్రం యారాడ బీచ్‌లో విషాదం చోటుచేసుకుంది. సముద్రపు అలల ఉధృతికి ఓ యువకుడు గల్లంతయ్యాడు. నేవీ కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ఉదయాన్నే యారాడ బీచ్ సందర్శనకు వెళ్లారు. సముద్ర తీరంలో సరదాగా గడుపుతున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా అలల తాకిడి అనూహ్యంగా పెరిగింది. చూస్తుండగానే అలలు వారిని చుట్టుముట్టాయి.
కొనసాగుతున్న గాలింపు చర్యలు
అలల తాకిడి ఒక్కసారిగా పెరగడంతో వారంతా సముద్రంలో ప్రమాదంలో చిక్కుకున్నారు. నీటి ప్రవాహం, అలల ధాటికి అక్షయ్ కుమార్ (20) అనే యువకుడు సముద్రంలోకి గల్లంతయ్యాడు. మిగిలిన ముగ్గురు అతికష్టం మీద సురక్షితంగా ఒడ్డుకు చేరుకుని బయటపడ్డారు. తమ కళ్లెదుటే అక్షయ్ కుమార్ సముద్రంలో కొట్టుకుపోవడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే విశాఖ న్యూపోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెస్క్యూ టీమ్‌లు, గజ ఈతగాళ్ల సాయంతో గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బీచ్‌లకు వచ్చే పర్యాటకులు అత్యుత్సాహం ప్రదర్శించవద్దని, లైఫ్ గార్డ్స్ సూచనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నారు.

# బాలుడి పొట్టలో నాణేలు, మేకులు, నెయిల్ క్లిప్పర్లు

### ⏭ ఉచితంగా సర్జరీ చేసిన వైద్యులు!

**టి మీడియా , ఆగస్టు 30 , తిరువణ్ణామలై :**
తీవ్రమైన కడుపు నొప్పి, తరచుగా వాంతులతో ఆస్పత్రిలో చేరిన ఒక బాలుడిని పరీక్షించిన వైద్యులకు మైండ్ బ్లాంక్ అయ్యే దృశ్యం కనిపించింది. స్కానింగ్ రిపోర్టులు చూసి డాక్టర్లే కంగుతిన్నారు. అత్యవసరంగా శస్త్ర చికిత్స నిర్వహించి వెంటనే ఆ బాలుడి కడుపు నుంచి ఏకంగా 43 లోహ వస్తువుల్ని బయటకు తీశారు. తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లాలో ఈ విచిత్రమైన, వైద్యపరంగా వింత ఘటన వెలుగుచూసింది. పూర్తి వివరాల్ని ఇప్పుడు తెలుసుకుందాం. అయ్యంపాళయం గ్రామానికి చెందిన బాలుడు కొంత కాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. అతడికి తరచుగా వికారంగా కూడా అనిపించేది. దీంతో అతడి తల్లి తిరువణ్ణామలైలోని తండరాంపట్టు రోడ్డులో ఉన్న ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలుడిని పరీక్షించిన జనరల్ సర్జన్ డాక్టర్ సుందర పాండియన్ కడుపులో నొప్పికి అసలు కారణాన్ని గుర్తించేందుకు అబ్డామినల్ ఏరియాలో స్కాన్ చేయాలని సూచించారు. ఇక స్కానింగ్ చేయగా ఆ రిపోర్టులో షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. ఆ పిల్లాడి కడుపులో అనుమానాస్పదంగా కనిపించే పదునైన లోహపు వస్తున్నట్లు ఉన్నట్లు గుర్తించారు. పొట్టలో లోహాలు ఉన్నట్లు గుర్తించిన డాక్టర్, అనుమానంతో బాలుడి తల్లిని ఈ వస్తువుల గురించి ప్రశ్నించారు. అయితే దీనిపై మాట్లాడిన ఆమె– బాలుడు తరచుగా నెయిల్ క్లిప్పర్లు, చైన్లు వంటి పలు వస్తువులను పోగొట్టేవాడని ఆమె చెప్పినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం ఆధారంగానే బాలుడు వాటిని మింగి ఉండొచ్చని డాక్టర్ అనుమానించారు. కడుపు నొప్పి తీవ్రంగా ఉండటంతో ఏ మాత్రం ఆలస్యం చేయకుండా శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. శుక్రవారం అర్ధరాత్రి వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించగా, ఈ సమయంలో బాలుడి కడుపులో మొత్తంగా 43 వస్తువులను బయటకు తీశారు. వాటిల్లో రూ.5, రూ.10 విలువైన 23 నాణేలు, ఒక తాయెత్తు, ఒక నెయిల్ క్లిప్పర్, రెండు చైన్లు, మూడు మేకులు, 15 హెయిర్ పిన్స్ వంటివి ఉన్నాయి. కడుపులో ఇన్ని రకాల వస్తువులు ఉండటం వైద్యులను కూడా తీవ్ర ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ వస్తువులు బాలుడి కడుపులో మరి కొంత కాలం ఉండి ఉంటే గనుక అతడి ఆరోగ్యానికి తీవ్రమైన నష్టం కలిగించే అవకాశం ఉండేదని వైద్య బృందం వివరించింది. ముఖ్యంగా పదునైన లోహపు వస్తువులు కడుపులోని అంతర్గత భాగాల్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇక ఆ శస్త్ర చికిత్స అనంతరం బాలుడి ఆరోగ్యం ప్రస్తుతం కాస్త నిలకడగా, మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు.

# అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు



● జర్నలిస్ట్ ఆత్మహత్య

**టి మీడియా , ఆగస్టు 30 , రాజాం:**

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబపరమైన సమస్యలతో కొంతకాలంగా మానసిక ఒత్తిడికి గురైన మాజీ జర్నలిస్టు అద్దంకి కృష్ణ అలియాస్ మధు (45) ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజాంలో విషాదాన్ని నింపింది. శనివారం వేకువజామున తాను నివసిస్తున్న అపార్ట్మెంట్‌లో మృతిచెందారు. ఘటనకు ముందు ఆయన తన స్నేహితులు, పరిచయస్తులకు పంపిన చివరి సందేశం తీవ్ర విషాదాన్ని నింపింది. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని మెంటిపేటకు చెందిన అద్దంకి కృష్ణ దశాబ్దానికి పైగా ఓ ప్రముఖ దినపత్రికకు రాజాం విలేకరిగా పనిచేశారు. స్థానికంగా జర్నలిస్టుగా మంచి పరిచయాలు ఏర్పరుచుకున్నారు. కొన్నేళ్ల క్రితం మధు తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఆయన జీవితం ఒక్కసారిగా మారిపోయింది. పలు శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. గుండె ఆపరేషన్ జరిగిన అనంతరం పక్షవాతం రావడంతో శారీరకంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనారోగ్యం కారణంగా చాలాకాలంగా ఇంటికే పరిమితమైన కృష్ణకు భార్య నర్మద సేవలు అందిస్తూ వచ్చారు. మరోవైపు అన్నదమ్ముల మధ్య ఆస్తులకు సంబంధించిన వివాదాలు కూడా చుట్టుముట్టాయి. కొన్ని ఆస్తులకు సంబంధించిన వ్యవహారాలు న్యాయస్థానంలో ఉన్నాయి. ఈ క్రమంలోనే కుమార్తె నర్మదసాయికి ఫార్మసీలో సీటు రావడంతో చదువు కోసం కొంత మొత్తం అవసరమైంది. ఇప్పటికే వైద్య ఖర్చులు, ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కృష్ణ తన కుమార్తె ఫీజు విషయమై మరింత ఆందోళన చెందాడు. దీంతో బలవన్మరణానికి సిద్ధమయ్యాడు.ఆత్మహత్యకు ముందు కృష్ణ తన మొబైల్ ద్వారా స్నేహితులకు ఓ భావోద్వేగ సందేశం పంపాడు. జీవితంలో తాను ఓడిపోయానని, తన జీవనయాత్రను ముగిస్తున్నానని పేర్కొన్నాడు. తన అంత్యక్రియలను త్వరగా పూర్తి చేయాలని, భార్య, కుమార్తెకు సహకరించాలని స్నేహితులను కోరారు. కృష్ణ మృతి పై తనకు ఎలాంటి అనుమానాలు లేవని ఆయన భార్య నర్మద పోలీసులకు తెలిపారు. దీర్ఘకాలిక అనారోగ్యం, గతంలో జరిగిన గుండె శస్త్రచికిత్స, అనంతరం ఎదురైన పక్షవాతం కారణంగా తీవ్ర నిరాశకు గురై ఈ నిర్ణయం తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు రాజాం ఎస్ఐ సల్మాన్ బేగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# తీరని దుఃఖం.. చెరువులో మునిగిన బాలుడు

● కాపాడేందుకు వెళ్లి

ముగ్గురు మహిళలు దుర్మరణం!

**టి మీడియా , ఆగస్టు 30 , ఢిల్లీ బ్యూరో :**

రాజస్థాన్‌లోని ధోల్‌పూర్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరమథుర ప్రాంతంలోని ఆంగై పోలీస్ స్టేషన్ పరిధిలోని ధోధ్–బిర్జా గ్రామం సమీపంలో చెరువులో మునిగి ముగ్గురు మహిళలు, ఒక బాలుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇందుకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.



పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధోల్‌పూర్‌లోని మొరోలీ గ్రామానికి చెందిన కొందరు మహిళలు, కుటుంబ సభ్యులతో కలిసి బిర్జా గ్రామంలోని హిరామన్ బాబా ఆలయానికి పూజల కోసం వెళ్లారు. ఆలయ దర్శనం అనంతరం చెరువు వద్దకు వెళ్లిన సమయంలో ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీటిలోకి జారిపడిపోయాడు. బాలుడు నీటిలో మునిగిపోతుండటాన్ని గమనించిన ముగ్గురు మహిళలు అతడిని రక్షించేందుకు చెరువులోకి దిగారు. అయితే నీటి లోతు, పరిస్థితుల కారణంగా వారు కూడా అదుపుతప్పి నీటిలో మునిగిపోయారు. క్షణాల్లోనే పరిస్థితి విషాదంగా మారింది.

బాలుడితో పాటు ముగ్గురు మహిళలు నీట మునిగారు. సమాచారం అందుకున్న వెంటనే ఆంగై పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో సహాయక చర్యలు ప్రారంభించారు. రెస్క్యూ బృందాలు చెరువులో గాలింపు చేపట్టి ముగ్గురు మహిళల మృతదేహాలను వెలికితీశాయి. మరోవైపు బాలుడి మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. మృతులను మొరోలీ గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ఘటన విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకున్నారు. తమ కళ్ల ముందే జరిగిన ఈ విషాదంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఒక బాలుడిని కాపాడేందుకు ప్రయత్నించిన ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, చెరువులో నీటి లోతు తదితర అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# చాక్లెట్ల రూపంలో గంజాయి



● గుట్టు రట్టు చేసిన

హైదరాబాద్ పోలీసులు

**టి మీడియా , ఆగస్టు 30 , హైదరాబాద్ బ్యూరో :**

హైదరాబాద్‌లో గంజాయి దందా కొత్త రూపాలు దాలుస్తోంది. ఒకవైపు చాక్లెట్ల రూపంలో గంజాయిని విక్రయిస్తూ యువతను టార్గెట్ చేస్తున్న ముఠాలు.. మరోవైపు ఒడిషా నుంచి భారీగా గంజాయిని నగరానికి తరలించేందుకు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా జరిగిన రెండు వేర్వేరు ఆపరేషన్లు.. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని సాగుతున్న గంజాయి నెట్‌వర్క్ ఏ స్థాయిలో జరుగుతుందనేది నిర్ధారిస్తుంది. శామీర్‌పేట్‌లోని తూముకుంట చంద్రారెడ్డి కాలనీలో గంజాయి చాక్లెట్ల విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. పాన్ షాప్‌ను తనిఖీ చేయగా.. ఏకంగా 5,298 గంజాయి చాక్లెట్లు బయటపడ్డాయి. దీంతో పాటు 25 కిలోల గంజాయిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బిహార్‌కు చెందిన బైద్నాద్, అతని భార్య పూజాకుమారి హైదరాబాద్‌కు వలసొచ్చి కొంతకాలంగా ఈ దందా నిర్వహిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. బిహార్ నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి.. ఒక్కో ప్యాకెట్‌ను రూ.600కు విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. దాడి సమయంలో బైద్నాద్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా.. అతని భార్య పూజాకుమారి పరారైంది. ఆమె కోసం గాలింపు కొనసాగుతోంది.మరోవైపు ఒడిషా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాపై ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టింది. పంతంగి టోల్‌ప్లాజా సమీపంలో 20 కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకుంది. స్మగ్లింగ్‌పై సమాచారం అందుకున్న ఈగల్ ఫోర్స్ దాదాపు 18 గంటలకు పైగా నిఘా నిర్వహించింది. విశాఖపట్నం జిల్లా సబ్బవరం నుంచి ప్రారంభమైన ఆపరేషన్.. చౌటుప్పల్ వరకు కొనసాగింది. చివరకు గంజాయి తరలిస్తున్న త్రిలోచన్ సమంత్ర, సాగర్ బాలాను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని హైదరాబాద్‌కు చెందిన బికాష్ బారిక్ కోసం తీసుకొస్తున్నట్టు విచారణలో తేలింది. బికాష్ బారిక్‌పై ఇప్పటికే గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఎన్డీపీఎస్ కేసు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఇక ప్రధాన సప్లయిర్‌గా భావిస్తున్న త్రిలోచన్ సమంత్రపై ఒడిషాలో 7కి పైగా క్రిమినల్ కేసులు ఉన్నట్టు గుర్తించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న బికాష్ బారిక్‌తో పాటు ఒడిషాకు చెందిన అమిత్ సాహ కోసం పోలీసులు గాలిస్తున్నారు. చాక్లెట్ల రూపంలో విక్రయాలు చేయడం నుంచి. . రాష్ట్రాల సరిహద్దులు దాటి భారీగా గంజాయి సరఫరా చేయడం వరకు ముఠాలు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నాయి. వరుస ఆపరేషన్లతో పోలీసులు, ఈగల్ ఫోర్స్ నెట్‌వర్క్‌లపై దాడులు చేస్తున్నప్పటికీ.. గంజాయి దందాను పూర్తిగా అడ్డుకోవడం సవాల్‌గా మారుతోంది. హైదరాబాద్‌లో ఈ ముఠాల మూలాలపై దర్యాప్తును పోలీసులు మరింత విస్తరించారు.

# ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం

● డిప్యూటీ సీఎం

భట్టి విక్రమార్క మల్లు

**టి మీడియా , మధిర:**

దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు.మధిర నియోజకవర్గంలోని చింతకాని, బోనకల్ మండలాల్లో ప్రజలకు అవసరమైన రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్య, వ్యవసాయ రంగాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.




చింతకాని మండలంలోని కొదుమూరు ఎస్సీ కాలనీలో రూ.66 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, లచ్చగూడెంలో రూ.29 కోట్లతో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణానికి, రూ.1.75 కోట్లతో లచ్చగూడెం – –నేరడ పీఆర్ రహదారి వరకు చింతకాని–– వందనం ఆర్అండ్‌బీ రహదారి నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి, రూ.7 కోట్లతో లచ్చగూడెం–– అనంతారం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.చింతకాని గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.44 లక్షలతో, నాగిలిగొండ ఎస్సీ కాలనీలో రూ.85 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, నాగిలిగొండ నుంచి తూటికుంట్ల వరకు రూ.5.25 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.బోనకల్ మండలంలోని నారాయణపురం ఎస్సీ కాలనీలో రూ.63 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి, రూ.1 కోటితో ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, రాయన్నపేట ఎస్సీ కాలనీలో రూ.19 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.నారాయణపురంలో రూ.80.84 లక్షలతో నిర్మించిన 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పీఏసీఎస్ గోదాంను, మోటమర్రిలో రూ.24.50 లక్షలతో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పీఏసీఎస్ గోదాంను డిప్యూటీ సీఎం ప్రారంభించారు.అదేవిధంగా కలకోట – రాపల్లి––గన్నవరం–– ముసలిమడుగు––లక్ష్మీపురం రహదారిని రూ.57 కోట్లతో కిలోమీటర్ 0/0 నుంచి 20/0 వరకు వెడల్పు చేసి పటిష్టం చేసే పనులకు, బ్రాహ్మణపల్లి––గన్నవరం మీదుగా రాపల్లి వరకు ఉన్న పీడబ్ల్యూడీ రహదారిని రూ.26 కోట్లతో కిలోమీటర్ 0/0 నుంచి 8/0 వరకు వెడల్పు చేసి పటిష్టం చేసే పనులకు శంకుస్థాపనలు చేశారు. రాపల్లిలో రూ.20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు కూడా డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూలి నేటి ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమం కోసం అనేకకార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్,సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గ ప్రసాద్, విద్యుత్ శాఖ సీఈ అశోక్, ఎస్ఈ శ్రీనివాస చారి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, సీపీఓ శ్రీనివాస్, హౌజింగ్ పీడీ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు చేరిన సాగర్ జలాలు

● త్రాగునీటి కోసమే

**టీ మీడియా ఆగస్టు 30, కూసుమంచి:**

త్రాగునీటి కొరకు నాగార్జున సాగర్ నుండి పాలేరు జలాశయానికి నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ శాఖ ఎస్ ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. విడుదల చేసిన సాగర్ నీరు పాలేరు జలాశయం కి చేరగా, ఆదివారం ఆయన పాలేరు పాత కాలువ, ఎన్ఎస్పి కాలువ గేట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ ఈ మాట్లాడుతూ ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్ లో 15.90 నీటిమట్టం ఉందని, జిల్లాకు త్రాగునీరు, మిషన్ భగీరథ కొరకు పాలేరు జలాశయాన్ని పూర్తిస్థాయి 23 అడుగుల నీటిమట్టం నింపనున్నట్లు చెప్పారు. సాగర్ నుండి 5000 క్యూసెక్కుల నీరు విడుదల చేయగా, దేవులపల్లి నుండి ప్రస్తుతం 2200 క్యూసెక్కుల నీరు పాలేరు జలాసానికి చేరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ నీటిని తాగునీటి కోసం పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. కాలువల గేట్ల లీకేజీలు, ఇతర లీకేజీలు ఉండకుండా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. వర్షభావ పరిస్థితుల దృష్ట్యా ప్రజల త్రాగునీటి అవసరాలు తీర్చేందుకు, పాలేరు జలాశయాన్ని నింపి, తద్వారా ప్రజలకు త్రాగునీటి సరఫరా అందించమన్నట్లు ఎస్ ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు సవివరంగా చెప్పారు.



# తెలంగాణలో కొత్త డ్రైవింగ్ లైసెన్స్ రూల్స్

● కఠిన నిబంధనలు వచ్చేశాయ్..

**టి మీడియా , ఆగస్టు 30 , హైదరాబాద్ బ్యూరో :**

తెలంగాణలోని వాహనదారులకు బిగ్ అలర్ట్. డ్రైవింగ్ లైసెన్స్ రూల్స్ అన్నీ మారాయి. ఇక నుంచి పర్మినెంట్ లైసెన్స్ పొందాలనుకునేవారికి నిబంధనలు మరింత కఠినతరం చేస్తూ తెలంగాణ రవాణాశాఖ నిర్ణయం తీసుకుంది. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునేవారు ఇప్పటినుంచి తప్పనిసరిగా ట్రాఫిక్స్ రూల్స్, రోడ్డు భద్రతకు సంబంధించి మూడు గంటల పాటు ఉండే వీడియో పాఠాలు వినాల్సి ఉంటుంది. వాటిని చూసిన తర్వాతనే డ్రైవింగ్ ట్రాక్ టెస్ట్‌కు అనుమతి మంజూరు చేస్తారు. వాహనదారులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించేందుకు రవాణశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఈ విధానాన్ని కూకట్ పల్లి ఆర్టీఏ కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఇతర జోన్లకు కూడా విస్తరించే అవకాశముందని తెలుస్తోంది.

మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించడం, డ్రైవింగ్ టెస్టుల్లో అక్రమాలను నివారించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు రవాణశాఖ వీడియో పాఠాలను తీసుకొచ్చింది. డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునేవారికి వీటిని తప్పనిసరిగా చూడాలనే నిబంధన విధించింది. ఈ వీడియోలు చూశాక డ్రైవింగ్ టెస్ట్‌కు అనుమతిస్తారు. డ్రైవింగ్ టెస్టులో క్వాలీఫై అయితే లైసెన్స్ మంజూరు చేస్తారు.




ప్రస్తుత విధానంలో ముందుగా లెర్నింగ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం పరీక్ష రాయాల్సి ఉంటుంది. పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే ఎల్ఎల్ఆర్ జారీ చేస్తారు. ఇది అందిన 30 రోజుల నుంచి ఆరు నెలల్లోపు పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక నుంచి డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునేవారు ముందుగా ఆర్టీఏ కార్యాలయలంలో మూడు గంటల పాటు వీడియో పాఠాలు చూడాల్సి ఉంటుంది. అనంతరం ట్రాక్ టెస్ట్‌కు పిలుస్తారు.

అయితే దరఖాస్తుదారుడు నిజంగా వీడియోలు చూశారా.. లేదా అనేది కూడా పరిశీలిస్తారు. ఇందుకోసం టీజీ ఆన్‌లైన్‌లో మాడ్యూల్స్ అందుబాటులో ఉంచింది. కాగా ప్రస్తుతం కొండాపూర్, ఉప్పల్, మేడ్చల్, నాగోల్, ఇబ్రహీంపట్నంలో డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్నవారు ఇక్కడికి వెళ్లి ట్రాక్ టెస్టులకు అటెండ్ కావాల్సి ఉంటుంది. ట్రాక్ టెస్టు అనంతరం మీకు ఒక స్లిప్ అందిస్తారు. మీరు పాస్ అయితే క్వాలీఫైడ్ అనే స్టాంప్ వేస్తారు. మీరు ఫెయిల్ అయితే రిజెక్టెడ్ అనే స్టాంప్ వేస్తారు. మీరు క్వాలీఫై అయితే పోస్ట్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ కొన్ని రోజుల్లో ఇంటికి డెలివరీ పంపిస్తారు. ఇక ఉత్తీర్ణ సాధించకపోతే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.